https://epaper.manasamajam.com
Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక
Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్
ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 | సంచిక : 317 | మంగళవారం 3-2-2026 | పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను
మన సమాజం
Truth towards the Society
మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# మీరెలా జాతిపిత?

## మీరు ఏ ఆదర్శాల కోసం నిలిచారు?



- నేరాలపై విచారణ వద్దనడం ఏమిటి?
- పోలీసులు నోటీసులిస్తే తప్పుబడతారా?
- మీ హయాంలో ఉద్యమకారులకు అవమానాలు
- హక్కుల కోసం కొట్లాడినోళ్లు సర్వం కోల్పోయారు
- ప్రజాస్వామ్యంలో నేరాలు చేసే స్వేచ్ఛ ఎవరికీ లేదు
- రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు మోదీ కుట్ర
- చదువుకున్న సర్టిఫికెట్ చూపించరెందుకు?
- రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పురస్కారం

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2**
ఈ మధ్య కొంతమంది వారికి వారే 'తెలంగాణ జాతిపిత' అని ప్రకటించుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. చేసిన తప్పులకు పోలీసులు నోటీసులిస్తే.. తెలంగాణ జాతిపితకు నోటీసులిచ్చారంటున్నారని విమర్శించారు. ఆయన నిజంగా తెలంగాణ జాతిపిత అయితే.. ఆనాటి భారత జాతిపితలాగా ఏ ఆదర్శాల కోసం నిలిచారో చెప్పాలన్నారు. భారత జాతిపిత ఏదైనా పదవి తీసుకున్నారా? కుటుంబం కోసం ఏమైనా అడిగారా? అని ప్రశ్నించారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోదుడు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ పురస్కారాన్ని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రదానం చేశారు. అంతకుముందు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు మొదలు తెలంగాణ సమాజాన్నంతా ఏకం చేసే బాధ్యత నిర్వర్తించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టించి మరీ పోలీసులతో ఈడ్చుకుపోయేంత నేరం ఆయనేం చేశారని నిలదీశారు. "మీరు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమకా రులను ఏ విధంగా అవమానించారో మర్చిపోయారా? ఇప్పుడు మీ తలుపులు ఎవరూ బద్దలు కొట్టలేదే? చేసిన తప్పులకు నోటీసులు ఇచ్చి విచారణకు రమ్మన్నారు అంతే కదా! అధికార నివాసానికి వస్తామని అధికారులంటే ఫామ్‌హౌసుకు వచ్చి రాసుకొమ్మంటారా? ఇదెక్కడి జాతిపిత విధానం?" అని రేవంత్ ధ్వజమెత్తారు.

**మానవతామూర్తి రావి నారాయణరెడ్డి..**
రాచరిక పోకడలు, అరాచక శక్తులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధరైతాంగ పోరాటంలో నాయకత్వ స్థానాన నిలిచి పోరాడిన గొప్ప సాహసి రావి నారాయణరెడ్డి అంటూ సీఎం రేవంత్ కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం 500 ఎకరాలు దానం చేసిన మానవతామూర్తి అని అన్నారు. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రజలకు స్ఫూర్తినిస్తూ.. పార్టీ, రాజకీయ పదవుల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగిన గొప్పనేత రావి నారాయణరెడ్డి అని శ్లాఘించారు. ఆయన త్యాగాలు ఆదర్శనీయమని, ఆయన ఔన్నత్యాన్ని భావితరాలకు చాటేలా మంచి కార్యక్రమాలు చేపట్టే బాధ్యత తమ ప్రభుత్వానిదని ప్రకటించారు. "ప్రపంచంలో ఎక్కడైనా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మానవ హక్కుల కోసం కొట్లాడిన చేగువేరా మొదలు రావి నారాయణరెడ్డి వరకు ఎంతోమంది సర్వం కోల్పోయారు. ఆస్తులు, అంతస్తులు త్యాగం చేశారు. అలాంటి త్యాగధనులను జాతిపితలుగా, ఉద్యమకారులుగా ప్రజలు కీర్తించారు. అంతేతప్ప.. వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో పదవులన్నీ మీరే తీసుకుంటిరి. వందల ఎకరాల ఫామ్‌హౌసలు మీకే వచ్చె. టీవీలు, పత్రికలు, వేలకోట్ల రూపాయల వ్యాపారాలు మీకే వచ్చె. చేయాల్సిన తప్పులన్నీ మీరే చేస్తిరి. కాంట్రాక్టులు మీరే పంచుకుంటిరి. ఇంత చేసిన తర్వాత మీరెట్లా జాతిపిత అయితరు? ఉద్యమకారుడెలా అయితరు?" అని రేవంత్ అన్నారు.

**నేరాలను విచారించొద్దు అనడమేంటి?**
"ఒక అసెంబ్లీ స్థానంలో ఓడిపోయినప్పుడు, పార్లమెంటు ఎన్నికల్లో మీకు ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వనప్పుడు మీరు ప్రజల తిరస్కరణకు గురయ్యారు. దీన్ని అర్థం చేసుకోకుండా మీకు ఓట్లు వేయకుండా ప్రజలే తప్పు చేశారని వారిపై నిందలు మోపడానికి ప్రయత్నిస్తే... ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదెక్కడి ఉద్యమకారుడి ఆలోచన? ప్రజలు తిరస్కరించినందున హుందాగా ప్రజాక్షేత్రం నుంచి తప్పుకొంటామని ముందుకు వచ్చి ప్రకటిస్తే కొంతైనా మీకు గౌరవం నిలబడు తుంది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఉంటుంది కానీ, నేరపూరితమైన పనులు చేయడానికి, ఆ నేరాలను విచారించవద్దనడానికి స్వేచ్ఛ లేదు. అధికారంలో ఉన్నప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రజాస్వామ్యంలో విచారణ తప్పదు" అని సీఎం రేవంత్ అన్నారు. శిబుసోరెన్, లాలూ ప్రసాద్, జయలలిత, యడ్యూరప్ప లాంటి మాజీ సీఎంలు విచారణ ఎదుర్కోలేదా? అని ప్రశ్నించారు. చట్టాలకు ఎవరమూ అతీతులం కాదన్నారు. తాను హార్వర్డ్‌కు వెళ్లినా రాష్ట్ర రాజకీయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నానని తెలిపారు. నాణేనికి రెండు వైపులు ఎలాగో.. ప్రజలకు కూడా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అంతే అవసరమని సీఎం రేవంత్ అన్నారు. కానీ, ప్రస్తుతం మోదీ లాంటి వాళ్లు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్ అంటున్నారని, ఈ పేరుతో వన్ పర్సన్ - వన్ పార్టీ విధానాన్ని దేశంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

# కేసీఆర్ విచారణ బూటకం!

## ఆయన, రేవంత్‌ది క్విడ్‌ప్రోకో

- ఫోన్ ట్యాపింగ్ అసలు బాధితులం మేమే
- రెండేళ్లయినా కేసును సాగదీస్తున్నారు
- బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదు?
- మునిసిపాలిటీల్లో రూ.2500 కోట్ల స్కాం
- పన్నుల డబ్బు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి
- బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు





**హైదరాబాద్, ఫిబ్రవరి 2** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారించడం ఓ బూటకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. కేసు పెట్టి రెండేళ్లు పూర్తయినా కాంగ్రెస్ సర్కారు ఇంకా విచారణ పేరిట కాలయాపన చేస్తోందని విమర్శిం చారు. అసలు ట్యాపింగ్ జరిగిందే బీజేపీ నాయకులపైన అన్నారు. తమ పార్టీ నాయకులపై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. ట్యాపింగ్‌తోనే మునుగోడులో బీజేపీని ఓడించానికి బీఆర్ఎస్ సర్కారు ప్రయత్నించి ందన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి రెండేళ్లయినా నత్తనడకన విచారణ కొనసాగుతోం దని, ఎవరిపైనా చర్యలు తీసుకోకుండా విచారణ మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ సర్కారు రేవంత్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, అందుకే ఇప్పుడు రేవంత్ సర్కారు కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇది క్విడ్‌ప్రోకో కిందకే వస్తుందన్నారు. నాడు బీఆర్ఎస్ రేవంత్‌కు సాయం చేయగా.. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్ పార్టీకి సాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు కేవలం విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇది యాక్టింగ్ మాత్రమేనని, యాక్షన్ కాదని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో రూ.2500 కోట్ల కుంభకోణం జరిగిందని, ప్రజల నుంచి పన్నుల డబ్బులు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి వెళుతున్నాయని రాంచందర్‌రావు విమర్శించారు.

# రేపు తెలంగాణలో నితిన్ నబీన్ పర్యటన



**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నితిన్ నబీన్ తొలిసారిగా తెలంగాణలో పర్యటించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్‌వీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ రాష్ట్ర శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

# కౌశిక్ రెడ్డిపై హెచ్చార్సీకి ఫిర్యాదు

**హైదరాబాద్, గన్‌పార్క్, ఫిబ్రవరి 2 :**
మత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు రాష్ట్ర మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ ఫిర్యాదు చేశారు. జనవరి 29న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీనంకలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసులపై, ముఖ్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అవమానకరంగా, ఆధారరహితంగా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. కమిషనర్‌ను మతపరంగా దూషిస్తూ, హిందూ సంస్కృతిని నాశనం చేస్తున్నారని, మత మార్పిడులకు పాల్పడుతున్నారంటూ కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కోట్లాది ముస్లింల మనోభావాలను దెబ్బతీశాయని ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు ఖురేషీ తెలిపారు.

# సుంకాలు తగ్గాయ్..

## భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్

- ప్రధాని మోదీతో ఫోన్‌లో ట్రంప్ చర్చలు.. అనంతరం ట్రూత్ సోషల్‌లో పోస్టు
- ప్రపంచ శాంతికి ట్రంప్ సారథ్యం అవసరమని వ్యాఖ్య.. అమెరికాలో జైశంకర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్‌పై ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బదులుగా రష్యా చమురు కొనుగోళ్లు ఆపేస్తామని, అమెరికా చమురు ఉత్పత్తులను భారీగా కొనుగోలు చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న టారి?ఫలను దశలవారీగా సున్నాకు తగ్గిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై వేసిన అదనపు 25శాతం సుంకాల అంశాన్ని ట్రంప్ ప్రస్తావించలేదు. కానీ భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ సోమవారం రాత్రి జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌పై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించినట్టుగా వెల్లడించారు. మరోవైపు సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 18శాతానికి సుంకాలను తగ్గించడంపై ట్రంప్‌కు 140 కోట్ల మంది భారతీయుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేత తదితర అంశాలు వేటినీ మోదీ ప్రస్తావించలేదు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందంటూ గతేడాది జూలైలో 25శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా నుంచి వద్దన్న చమురు కొంటోందంటూ ఆగస్టులో సుంకాలను 50శాతానికి పెంచిన విషయం తెలిసిందే.సోమవారం ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో తొలుత ఈ విషయాన్ని వెల్లడించారు. తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. "నా గొప్ప స్నేహితుల్లో ఒకరు, శక్తివంతమైన నేత ప్రధాని మోదీతో మాట్లాడాను. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం సహా చాలా అంశాలపై చర్చించాం. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేసేందుకు.. అమెరికా నుంచి, ముఖ్యంగా వెనెజువెలా నుంచి భారీగా చమురు కొనుగోలు చేసేందుకు మోదీ అంగీకరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ఇది తోడ్పడుతుంది.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

- ఎన్నిసార్లు కేంద్రాన్ని కోరినా ఆయిల్‌పామ్‌పై
- దిగుమతి సుంకం పెంచని కేంద్ర ప్రభుత్వం - పసుపు బోర్డుకు నిధుల కేటాయింపు లేదు
- రైతాంగానికి బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చింది - వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగేదేమీలేదని, రైతులకు తీవ్ర నిరాశ కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కోట్లాది రైతుల ఆశలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆయిల్‌పామ్ దిగుమతులపై సుంకం పెంపు విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీంతో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని చెప్పారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించకుండా... దిగుమతులకు అనుకూలంగా కేంద్రం వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. 'పసుపు బోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించలేదు. పసుపును అధిక విలువైన పంటగా గుర్తించలేదు. లక్షలాది మంది పసుపు రైతులు ఎదురుచూస్తున్న డెడికేటెడ్ ఫండ్ గురించి బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చింద'ని పేర్కొన్నారు. కొబ్బరి బోర్డు ఏర్పాటుపైనా ఎలాంటి ప్రకటనా లేదన్నారు.ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలతో కేంద్రం రైతులపై మరింత భారం మోపనుందని తెలిపారు.



# ఒంటరి తనంతోనే..ఆత్మ హత్యలు.

**హైదరాబాద్ శివార్లలో తల్లీబిడ్డల ఆత్మహత్య వేనూక చీకటి కధనం...**

**కుటుంబ, ఆస్తి గొడవల కోణంలోనూ కొనసాగుతున్న దర్యాప్తు....**

**ఒంటరితనమే ప్రధాన కారణమని ప్రాథమిక నిర్ధారణ**

**సూసైడ్ నోట్, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం**

**ఫోరెన్సిక్ విశ్లేషణతో మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
హైదరాబాద్ శివార్లలో జరిగిన తల్లీబిడ్డల ఆత్మహత్య ఘటనలో క్రమంగా కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చర్లపల్లి--ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్‌పై ఐటీ ఉద్యోగిని విజయరెడ్డి తన ఇద్దరు పిల్లలు చేతన, విశాల్‌తో కలిసి బలవన్మరణానికి పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దారుణానికి ఆమెను వెంటాడిన తీవ్ర ఒంటరితనమే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఉప్పల్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన విజయరెడ్డికి 2007లో సురేందర్‌రెడ్డితో వివాహమైంది. భర్త నాలుగేళ్లుగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండటంతో ఆమె తల్లితో కలిసి నివసిస్తూ, నగరంలోని ఓ ఐటీ సంస్థలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నారు. నైట్ షిఫ్టుల కారణంగా ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో ఉంచి చదివించాల్సి వచ్చింది. భర్త దూరంగా ఉండటం, పిల్లలు కూడా దగ్గర లేకపోవడంతో గత 15 రోజులుగా ఆమె తీవ్ర ఒంటరితనానికి లోనై, స్నేహితులు, బంధువుల వద్ద తన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. శనివారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి పిల్లలను కారులో తీసుకువచ్చిన విజయరెడ్డి, చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద కారు నిలిపారు. అక్కడ పార్కింగ్ స్లిప్ వెనుక భాగంలో "నాకు బతకాలని లేదు. నేను లేకపోతే పిల్లలు అనాథలవుతారు. అందుకే నాతో పాటే తీసుకెళు_న్నా" అంటూ సూసైడ్ నోట్ రాశారు. ఆ నోట్‌ను ఫొటో తీసి వాట్సప్ స్టేటస్‌గా కూడా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం పిల్లలతో కలిసి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటన స్థలంలో ఉన్న కారు నుంచి సూసైడ్ నోట్‌తో పాటు విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఆత్మహత్యకు ముందు ఆమె ఎవరితో మాట్లాడింది, చాటింగ్ వివరాలు, కాల్ డేటా వంటి అంశాలపై లోతుగా విచారణ చేస్తున్నారు. కుటుంబ కలహాలు లేదా ఆస్తి వివాదాల కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

**- శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం - దావోస్ తర్వాత అమెరికా పర్యటన పూర్తి**

**- హార్వర్డ్‌లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి - 20 దేశాల ప్రతినిధులతో కలిసి శిక్షణ**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్నారు. నిన్న రాత్రి 2.50 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన ల్యాండ్ అయ్యారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న విషయం తెలిసిందే. ఆ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన అమెరికాకు వెళ్లారు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కి చెందిన కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో లీడర్‌షిప్ కోర్సును పూర్తి చేశారు. జనవరి 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన ప్రత్యేక తరగతులకు సీఎం హాజరయ్యారు. ఈ కోర్సులో ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది ప్రతినిధులతో కలిసి ఆయన శిక్షణ పొందారు. పాలన, నాయకత్వం, భవిష్యత్ విధానాలపై ఈ కార్యక్రమంలో విస్తృత చర్చలు జరిగాయి. అమెరికాలో కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం సీఎం రేవంత్ రెడ్డి స్వదేశానికి తిరిగి వచ్చారు. దావోస్ పర్యటన, హార్వర్డ్ లీడర్‌షిప్ కోర్సు నేపథ్యంలో సీఎం పర్యటన రాష్ట్ర రాజకీయ వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది.

# గ్రామీణ ఉపాధి హామీకి బుల్డోజర్ : కాంగ్రెస్ ఆగ్రహం

**- ఎంజీఎన్‌ఆర్‌ఈజీప పరివర్తనాత్మక చట్టం - కొత్త చట్టం లోపమంటూ జైరామ్ రమేశ్ విమర్శ**

**- 20 ఏండ్లలో 180 కోట్ల పనిదినాలు - గ్రామీణ పేదలకు ఆస్తులు, భరోసా**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:**
కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. తాము తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక పరివర్తనాత్మక చట్టమైతే, కేంద్రం తీసుకొస్తున్న కొత్త పథకం లోపభూయిష్టమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. పాత పథకాన్ని కొత్త పథకం బుల్డోజ్ చేసినట్లుగా ఉందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, నేటికి సరిగ్గా 20 ఏండ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీప ను ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బద్నపల్లిలో ఈ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో గ్రామీణ ప్రజలకు ఈ పథకం ద్వారా 180 కోట్ల పనిదినాలు కల్పించామని తెలిపారు. అంతేకాక గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 10 కోట్ల సామాజిక ఆస్తులను ఈ పథకం ద్వారా సృష్టించామని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం గ్రామాల నుంచి వలసలను గణనీయంగా తగ్గించిందని, గ్రామపంచాయతీలను బలోపేతం చేసిందని చెప్పారు. గ్రామీణ పేదలకు అధిక వేతనాలు పొందే శక్తిని ఈ చట్టం అందించిందని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు బదిలీ చేయడం ఈ చట్టంలోని కీలక సంస్కరణగా జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. అలాగే సన్నకారు రైతులకు తమ స్వంత భూముల్లోనే బావులు తవ్వడం వంటి సాగునీటి సదుపాయాలు కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందన్నారు. ఇలాంటి ప్రజాహిత చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

**సదాశివయ్య భవన్‌లో మంత్రులు, అధికారులతో సమావేశం**

**భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

**వసతి, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణపై ఆదేశాలు**

**అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు**




**శ్రీశైలం, ఫిబ్రవరి 2:**
శ్రీశైలంలో త్వరలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత సదాశివయ్య భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో సహచర మంత్రులు అనమ్ రామనారాయణ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి తో పాటు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్ లాల్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ఎస్పీ సునీల్ షోరాన్ హాజరయ్యారు. అటవీ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మంత్రి అనిత అధికారులతో విస్తృతంగా చర్చించారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, వైద్య సదుపాయాలు సమర్థంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు వసతి సౌకర్యాలు, తాగునీటి సరఫరా, శౌచాలయాల నిర్వహణ, క్యూలైన్లలో అవసరమైన సదుపాయాల కల్పనపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శాంతియుతంగా, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అనిత ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

# కేటీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ

**సిట్ విచారణలు, ప్రభుత్వ వైఖరిపై చర్చ**

**మునిసిపల్ ఎన్నికల వ్యూహంపై సమాలోచన**

**నిజామాబాద్ జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చ**

**కేటీఆర్ నివాసంలో ఆత్మీయ సమావేశం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిట్ విచారణల పేరుతో పార్టీ నేతలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని జీవన్ రెడ్డి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. అలాగే రానున్న మునిసిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, శ్రేణులు తీసుకోవాల్సిన వైఖరి వంటి అంశాలపై ఇద్దరూ విస్తృతంగా చర్చించారు. సమావేశం సమయంలో జీవన్ రెడ్డిని కేటీఆర్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి తీసుకో వాల్సిన చర్యలపై కూడా కేటీఆర్ జీవన్ రెడ్డితో అభిప్రాయాలు పంచుకున్నారు. మొత్తంగా ఈ భేటీ బీఆర్ఎస్‌లో ఐక్యతను చాటేలా, రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేలా సాగిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## నిమ్మల శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 2**
ప్రముఖ సినీ దర్శకుడు నిమ్మల శంకర్ మాతృమూర్తి నిమ్మల సక్కుబాయమ్మ గత వారం స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం శంకర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్, శంకర్‌తో పాటు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తల్లి మరణం తీరని లోటని పేర్కొంటూ, ఈ కఠిన సమయంలో కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కేటీఆర్ పరామర్శకు శంకర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నక్సలిజంపై పోరాటానికి రూ.3,610 కోట్లు

**మార్చి 31ని డెడ్‌లైన్‌గా ప్రకటించిన కేంద్రం**

**20 శాతానికిపైగా పెరిగిన నిధుల కేటాయింపు**

**భద్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:**
దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. మార్చి 31ని డెడ్‌లైన్‌గా పేర్కొం టూ, నక్సలిజంపై పోరాటానికి ఈసారి కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించేందుకు రూ.3,610 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాల కార్యకలాపాలు, పోలీసింగ్ వ్యయం, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు వంటి అంశాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. అలాగే ప్రత్యేక మౌలిక వసతుల అభివృద్ధి పథకాల కోసం కూడా ఈ మొత్తాన్ని రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో (సవరించిన అంచనాల ప్రకారం) నక్సలిజంపై పోరాటానికి రూ.3,006 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. తాజా బడ్జెట్‌లో ఈ వ్యయాన్ని 20 శాతానికి పైగా పెంచుతూ రూ.3,610 కోట్లకు చేర్చడం గమనార్హం. ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం తీసుకుంటున్న కఠిన వైఖరిని స్పష్టంగా చూపుతోంది. నక్సలిజం నిర్మూలనతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కూడా కేంద్ర లక్ష్యంగా పెట్టుకున్నట్లు బడ్జెట్ ప్రతిపాదనలు సూచిస్తున్నాయి.

# ఉద్యమ కాలం రోజులు మళ్లీ గుర్తొచ్చాయి : కేటీఆర్

**- 7,000 గ్రామాల్లో నిరసనలు, దిష్టిబొమ్మల దహనం - హైదరాబాద్, పట్టణాల్లో భారీ ర్యాలీలు**

**- పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్ - మమ్మల్ని ఒక్కటి చేసిన రేవంత్ రెడ్డికీ ధన్యవాదాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** నిన్న జరిగిన పరిణామాలు ఉద్యమ కాలం నాటి రోజులను మళ్లీ గుర్తు చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలిరావడం చూస్తే ఉద్యమ స్ఫూర్తి ఇంకా సజీవంగానే ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7,000 గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మలు దగ్ధం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ నగరంతో పాటు ఇతర పట్టణాల్లో కూడా భారీ ర్యాలీలు నిర్వహించారని చెప్పారు. ఈ నిరసనల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులందరికీ కేటీఆర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలే తమ అసలైన బలం అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలపడం పార్టీ సంస్కృతి అని స్పష్టం చేశారు. అలాగే, ఈ పరిణామాల ద్వారా తమను మరింత ఐక్యం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికూ కృతజ్ఞతలు తెలిపారు. "మమ్మల్ని ఒక్కటి చేసిన రేవంత్ రెడ్డికి కూడా ధన్యవాదాలు" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అభివృద్ధి-సంక్షేమ సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయాలి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**- ఆధునీకరించిన ఐడిపిఆర్ వెబ్‌సైట్ ప్రారంభం - ప్రజాపాలనలో పారదర్శకతకు టెక్నాలజీ కీలకం**

**- ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో ప్రజాసంబంధాల శాఖ కీలక పాత్ర**





**హైదరాబాద్, ఫిబ్రవరి 2 :** ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజాసంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆధునీకరించిన సమాచార-ప్రజాసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐడిపిఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్వో జి. మల్సూర్, సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు హాజరయ్యారు. కొత్త వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించవచ్చని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు కోరుకున్న మార్పు దిశగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే స్పష్టమైన ఫలితాలు చూపించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని అన్నారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌తో ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలు ఒకవైపు, పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు మరోవైపు అమలవుతున్నాయని చెప్పారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను ప్రభుత్వం రచిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజాసంబంధాల శాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు ఈ సందర్భంగా సూచించారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలపై రాష్ట్రస్థాయి సమీక్ష

**- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కచ్చితంగా అమలు చేయాలి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్**

**- ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కుపై స్పష్టమైన మార్గదర్శకాలు**

**- శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు**





**హైదరాబాద్, ఫిబ్రవరి 2**

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని జిల్లాల్లో ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కుపై స్పష్టతనిస్తూ, పరోక్ష విధానంలో జరిగే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు ఎక్స్ ఆఫీషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంచుకొని ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. సెక్షన్ 5, 20 ప్రకారం ఎన్నికైన 30 రోజుల్లోపు సంబంధిత మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని, ఇప్పటివరకు ఇవ్వని వారు మున్సిపల్ ఎన్నికలు పూర్తైన 30 రోజుల్లోపు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఆప్షన్ అందజేయాలని తెలిపారు. ఇందుకోసం ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీల మధ్య నోటీసులు జారీ చేసి ఆప్షన్లు స్వీకరించాలని సూచించారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పోలింగ్, కౌంటింగ్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీల్లో నోటీసులు జారీ చేసి ఆప్షన్లు తీసుకుంటామని, ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సమస్యను పరిష్కరిస్తాం

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 2**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్) సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, మల్క కొమరయ్య, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, సుంకరి భిక్షం గౌడ్ సోమవారం కేంద్ర మంత్రిని పార్లమెంటు ఆవరణలో కలిశారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు.

## పీఎస్‌యూల పునరుజ్జీవనానికి కొత్త స్ఫూర్తి

దేశంలో అతిపెద్ద కోకింగ్ కోల్ ఉత్పత్తిదారు, కోలిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఈ సంవత్సరం జనవరి 19న ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఈ సంస్థ ఐపీఓ చరిత్ర సృష్టించింది. రూ.1,070 కోట్లను సేకరించడానికి ఆఫర్‌లో ఉన్న 46 కోట్ల షేర్ల కోసం 147 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. 90 లక్షలకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. భారత ప్రభుత్వరంగ సంస్థల విజయవంతమైన ఐపీఓ లిస్టింగ్ ఇదొక్కటే కాదు. ఈ ఒరవడి గత కొన్నేళ్లుగా ఇలాగే స్థిరంగా కొనసాగుతోంది. గత7-8 సంవత్సరాల కాలంలో దాదాపు 15 ప్రభుత్వరంగ సంస్థలు భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అవడంతోపాటు అవసరమైన మూలధనాన్ని సేకరించగలిగాయి. వాటాదారుల షేర్ల విలువను పెంచడంతో పాటు రిటైలర్ల సంపదను కూడా సృష్టించగలిగాయి. 2017 నుంచి, భారతదేశంలో ఇంజనీరింగ్, నిర్మాణం, రైల్వే, రక్షణ, ఇంధన సంబంధిత రంగాలలో 10కి పైగా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. తద్వారా, దిగువ పేర్కొన్న కంపెనీలలో, మూలధన మార్కెట్ విలువ రూ. 1.40 లక్షల కోట్ల నుంచి రూ. 8.53 లక్షల కోట్లకు పెరిగింది-- ఇది 513 శాతం భారీ పెరుగుదల. ఆగస్టు, 2017లో రూ.7,096 కోట్లతో లిస్టింగ్ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి రూ.42,634 కోట్లకు (501 శాతం) పెరిగింది. అక్టోబర్, 2020లో రూ.3,489 కోట్లతో లిస్టింగ్ అయిన మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి ఏకంగా రూ.1,00,000 కోట్లకు (అంటే 2,766శాతం!) పెరిగింది. అదేవిధంగా, జూలై, 2018లో రూ.4, 254 కోట్లతో లిస్టింగ్ అయిన =×ుజూ లిమిటెడ్ మార్కెట్ మూలధనం రూ. 11,652 కోట్లకు (174శాతం) పెరిగింది. ×=జూచీ ఇంటర్నేషనల్ సెప్టెంబర్, 2018లో రూ.3,919 కోట్ల నుంచి రూ.16,704 కోట్ల (326 శాతం)కు పెరిగింది. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఏప్రిల్, 2019లో రూ.3,972 కోట్ల నుంచి రూ.74,508 కోట్లకు (1,776 శాతం) పెరిగింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ జనవరి, 2021లో రూ.32,475 కోట్ల నుంచి రూ.1,63,000 కోట్లకు (402శాతం) పెరిగింది. అంతేగాక, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ ు టూరిజం కార్పొరేషన్-- అక్టోబర్, 2019లో రూ.11,658 కోట్ల నుంచి రూ.54,764 కోట్లకు (370శాతం), రైల్ టెల్ కార్పొరేషన్ (ఫిబ్రవరి, 2021) రూ.3,896 కోట్ల నుంచి రూ.11,924 కోట్లకు (206శాతం), హౌసింగ్ ు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (మే, 2017) రూ.14,514 కోట్ల నుంచి రూ.45,683 కోట్లకు (215 శాతం), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (మార్చి, 2018) రూ.37, 731 కోట్ల నుంచి రూ.2,93,000 కోట్లకు (676 శాతం), ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (నవంబర్, 2023) రూ.16,124 కోట్ల నుంచి రూ.39,301 కోట్లకు (144శాతం) పెరిగింది. ఈ పీఎస్‌యూలు అన్నీ మొత్తంగా తమ మూలధన మార్కెట్ విలువను రూ.1,39,128 కోట్ల నుంచి రూ. 8,53,170 కోట్లకు (అంటే దాదాపు 513 శాతానికి) పెంచుకు న్నాయి. భారీ పెరుగుదల ఇది. గతంలో, ప్రభుత్వరంగ సంస్థలు మూలధన పెట్టుబడులు, ఇతర విస్తరణ పనుల కోసం సంబంధిత మంత్రిత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడాల్సి వచ్చేది. దీనికోసం ఆయా మంత్రిత్వ శాఖల్లో వివిధ విభాగాలతో విస్తృతమైన చర్చలు జరపాల్సి రావడమే కాకుండా నిధులను విడుదల చేయించుకో వడానికి చాలా సమయం పట్టేది. నేడు నిర్ణయాలు అమలు చేయడంలో ఎంతో వేగాన్ని ప్రదర్శిస్తున్న ఈ సంస్థలు నిధుల కోసం ఎదురుచూసే స్థితి నుంచి.. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నిధులు సమకూర్చే స్థాయికి ఎదిగాయి. గత పరిస్థితులతో పోలిస్తే ఇది రివర్స్ ట్రెండ్. ఉదాహరణకు, క్రిటికల్ మినరల్స్ రంగంలో భారతదేశ దీర్ఘకాల అవసరాల దృష్ట్యా స్థిరమైన సప్లయ్ చైన్‌ను బలోపేతం చేసేందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ జనవరి 2025లో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించింది. దీని కోసం రూ.34,300 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అందులో రూ. 1,500 కోట్లు మాత్రమే బడ్జెట్ నుంచి లభిస్తున్నాయి. వివిధ మంత్రిత్వ శాఖల విభాగాల సంపూర్ణ సమన్వయం విధానంతో కేంద్ర ప్రభుత్వం సమకూర్చే ఇతర పెద్ద మొత్తాన్ని అటుంచితే, 50శాతానికి పైగా నిధులు అంటే.. రూ.18,000 కోట్లు వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు సమకూరుస్తున్నాయి. వీటిలో గనుల మంత్రిత్వ శాఖ నుంచి KABIL, బొగ్గు శాఖ నుంచి కోలిండియా లిమిటెడ్, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్, ఉక్కు శాఖ నుంచి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ నుంచి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, పెట్రోలియం శాఖ నుంచి ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ వంటివి ఉన్నాయి. రానున్న రోజుల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, సంబంధిత సాంకేతికతను మెరుగుపరిచేందుకు ఈ సంస్థల నుంచి సేకరించే పెట్టుబడులను ఉపయోగిస్తారు. ఎన్‌సీఎమ్ఎమ్ కోసం పీఎస్‌యూల నుంచి పెట్టుబడులను తీసుకొచ్చిన ఈ వ్యూహాత్మక విధానం రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ కీలకమైన కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమకూర్చేలా.. కేంద్ర ప్రభుత్వానికి ఒక మంచి అవకాశం అందించింది. చాలా వరకు మార్కెట్లు స్థిరమైన పెట్టుబడులు కొనసాగించిన వాటాదారులకు మాత్రమే మంచి లాభాలను అందిస్తాయి. బీసీసీఎల్ విషయానికి వస్తే.. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూగా ముద్ర పడటం నుంచి మొదలుపెట్టి.. వ్యాల్యూ-డ్రివెన్ వ్యవస్థ గా, వ్యూహాత్మకంగా కీలకమైన సంస్థగా మారడం వరకు అది సాగించిన ప్రయాణం మనందరికీ తెలుసు. ఇవాళ ఈ సంస్థకు భారతదేశ డొమెస్టిక్ కోకింగ్ కోల్ ఉత్పత్తిలో 58.5శాతం వాటా ఉంది. దీంతో కీలకమైన ఉక్కు, మౌలిక సదుపాయాల రంగంలో ఇది అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది. ఈ ముఖ్యమైన విషయాన్ని పెట్టుబడిదారులు గుర్తుపెట్టు కున్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, తయారీరంగ అభివృద్ధి ఆత్మనిర్భరతపై దృష్టి సారించిన ఆర్థిక వ్యవస్థలో, బీసీసీఎల్ ఒక బొగ్గు



## అతని వల్లే డ్యాన్స్‌లో

# పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ఛమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

## రెండు వేలకు మించి

# ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

